# ప్రేమలేఖ

[శ్రీ ఎస్. ఆర్. రావు]

ప్రమీలకి ప్రేమలేఖ రాస్తూంటే, శశి లెటరు ప్యాడులాగేసి పారిపోయింది. నానాత్రిప్పులుపెట్టి, నాదగ్గర అణాడబ్బులు కాజేసి-తను చదివి మరీ యిస్తానంది.

—నా ముద్దులమూట ప్రమీలకి---; శశి గట్టిగా చదవడమారంభించింది.

'ఎవరయినావింటారు గట్టిగా చదవకు'

'ఏంటిబావా: నీరాతలు. మాతమ్ముణ్ణెవరయినా' ముద్దుపెట్టుకొంటారుగాని, పడ్డలాగున్న మా అక్కని ముద్దుపెట్టుకొంటానంటే, నీకు సబబుగావుందీ?

విమర్శకుడు మల్లే శశి ప్రశ్నార్థకముగా నాపక్క చూసింది.

ఆచిన్నారికేమిజవాబుచెప్పాలో. నాకు తెలియలా. "ఇచ్చే అమ్మా. మంచిదానవు కావూ."

'మరిపూర్తికానీ బావా—వెన్నెలరాత్రుల్లో శారద తిన్నెలమీద—శశి చదువు మొదలెట్టింది.

'ఆ. ఔనుబావా. నాకు జ్ఞాపకమొచ్చింది. ఆవేళ అక్కనిన్ను గోతులోతోసేసింది కదూ. అదేనా రాశావూ—ఆ మధురక్షణాల్ని తలుచుకొంటూ— (చదువుతున్నాది)

'అదినువ్వు రాయనేలేదు బావా. ఏంటీ రామాయణం! శశి ప్రశ్నించింది.

నేజవాబుచెప్పకుండానే....

—సింప్సన్ యెడ్వర్డులవలె మన యిరువురం—తొందరగా...శశి పెదవు లాడుతున్నాయి.

బావా: నీకుమతిపోతున్నాది. నువ్వు అక్కా కిరస్తానమతములో కలిసిపోతారని చెప్పేస్తా.

"అదికాదమ్మా''

ప్రేమలేఖలోని మూడో అంకంమీద శశికళ్ళుపడినయి—నేనేనీవయి, నీవేనేనయి-

'బావా. తెలియకడుగుతాను. ఆడాళ్లుమగాళ్ళుగ, మగాళ్ళుఆడాళ్ళుగా మారిపోతారేంటి. ఔనౌను. నువ్వు అబద్ధమాడవు. నీపేరు రామంకదూ. అప్పుడు నిన్ను రామమ్మని పిలుస్తాం. మరి అక్కకి ఏంపేరుపెడ్దాం?

ఆమె ప్రశ్నపరంపరలకి నానోటినుంచి తుంపరులు రాలినయి.

"మావయ్యవచ్చేసమయింది. ఆ pad యిచ్చేఅమ్మా."

'ఉండు అయిపోవచ్చింది --- నాప్రియమైన—...బావా. అక్కకి స్నోమల్లు చీరంటే ఎంతో ప్రియం తెల్సునా.'

"ఇగనేనాయిచ్చేఅమ్మా"

'ఉహూ—మరో అణా యియ్యావూ'

జేబు చిరుగులలోంచి నావ్రేళ్ళు బయటికొచ్చినయి.

'బావా. అదుగోఅన్నాజీవస్తున్నాడు ఉత్తరం వాడికిచ్చేస్తా' నంటూ వాళ్లన్నవైపు పరుగెత్తింది.

ప్రమీలకు రాసిన పవిత్ర 'ప్రేమలేఖ' శశిమూలాన బయటపడింది. ఇంట్లో అందరూ నవ్వుకున్నారు. కాని నాకదో మాదిరి సిగ్గువేసింది. ఉదయాన 7-30 మెయిలుకు మొదటి టిక్కెటు నాదే.